మందు బాబుల వీరంగం

- పోలీసుల రంగప్రవేశం
- భయాందోళనలో గ్రామస్తులు

మోపిదేవి: మందు బాబులు వీరంగం సృష్టించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. ఏమి జరుగుతుందోనని స్థానికులు పరుగులు పెట్టారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యం షాపులో మద్యం సేవిస్తుండగా ఒక వ్యక్తి చెయ్యి మరోవ్యక్తికి పొరపాటున తగిలిందని తెలుస్తోంది. దీంతో మాటా మాటా పెరిగి రెండు వర్గాలు బాహీ బాహీగా తలపడటంతో భయానక వాతావరణం ఏర్పడింది. మోపిదేవి బస్టాండ్ సమీపంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. సమీపంలో ఉన్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని గుంపులను చెదరగొట్టారు. ఇళ్లమధ్య మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్లే మహిళలు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రెండు వర్గాలను చెదరగొడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

సలార్‌దాదాకు పేర్ని నాని పరామర్శ

మచిలీపట్నంటౌన్: ఇటీవల సోదరుడు షేక్ యూసుఫ్‌ను కోల్పోయి దుఃఖంలో ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదాను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) శనివారం పరామర్శించారు. స్థానిక ఇనగుదురుపేటలోని సలార్‌దాదా నివాసానికి పేర్నినాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వెళ్లి సలార్‌దాదాను, మృతుడు యూసుఫ్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. సలార్‌దాదాను పరామర్శించిన వారిలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్, పార్టీ నాయకులు మట్టా నాంచారయ్య, మహమ్మద్ రఫీ, నజాఫ్‌అలీ, జంపాన సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



సలార్‌దాదాను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పేర్నినాని, పార్టీ ఇన్‌చార్జి పేర్నికిట్టు, నాయకులు

చేనేత కార్మికులకు ముద్ర రుణాల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 24 మంది చేనేత కార్మికులకు రూ.12 లక్షల ముద్ర రుణాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సాయిప్రసాద్, పురిటిగడ్డ ఇండియన్ బ్యాంకు మేనేజర్ వంశీకృష్ణ, పలువురు చేనేత సంఘ నేతలు పాల్గొన్నారు.

నేడు కార్తికేయుని సన్నిధిలో పంచాంగ శ్రవణం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు పంచాంగం శ్రవణం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఉగాది పచ్చడి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

స్వామివారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ

మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని విజయవాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్ధ సతీష్‌శర్మ, ఫణికుమార్ శర్మ, వెంటేశ్వరావు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.



మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్

అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి రాము పరామర్శ

కృత్తివెన్ను: స్థానిక ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న మరియకుమారి (48) అనారోగ్యంతోమరణించారు. శనివారం వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము, నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె భర్త హేమాచలం, కుటుంబ సభ్యులను రాము పరామర్శించారు. మరియకుమారి మృతదేహాన్ని సీడీపీవో సముద్రవేణి సందర్శించి శాఖాపరంగా మట్టిఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆమె భర్తకు అందించారు. నాయకులు, ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.



మరియకుమారి భర్తకు ధైర్యం చెపుతున్న ఉప్పాల రాము

చల్లపల్లి బీఎంసీకి రూ.1.30 కోట్ల బోనస్ విడుదల

చల్లపల్లి: చల్లపల్లి బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ పరిధిలోని 50 పాల ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన 5 వేల మంది రైతులకు రూ.1.30 కోట్లు బోనస్‌లు విడుదలైనట్లు ఆయా సంఘాల అధ్యక్షులు శనివారం తెలిపారు. స్థానిక బీఎంసీ సభా మందిరంలో శనివారం సమావేశం సంఘ అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద నీటిలో మునిగి సంస్థకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లినప్పటికీ రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని బోనస్‌లు విడుదల చేసినందుకు కృష్ణా మిల్క్ యూనియన్ సంస్థకు, చైర్మన్ చలసాని ఆంజనేయులుకు పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. 2024- 25 సంవత్సరం చివరి నాలుగు నెలల కాలానికి కృష్ణాజిల్లాలోని రైతులకు రూ.18 కోట్లు బోనస్ విడుదల చేయగా పామర్రు క్లస్టర్ కింద ఉన్న పామర్రు, చల్లపల్లి, అవనిగడ్డల్లోని బీఎంసీలకు రూ.2.70 కోట్లు, కేవలం ఒక్క చల్లపల్లి బీఎంసీకి రూ.1.30 కోట్లు మంజూరైనట్లు వారు తెలిపారు. రూపాయికి 10 పైసల చొప్పున బోనస్ విడుదల చేసి ప్రోత్సహిస్తున్న విజయా మిల్క్ యాజమాన్యానికి రైతులు ధన్యవాదాలు చెప్పారు. సమావేశంలో చల్లపల్లి బీఎంసీ (బల్క్ మిల్క్ కూలర్) పరిధిలోని యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి, లక్ష్మీపురం, చింతలమడ, మేకావారిపాలెం, నూకలవారిపాలెం ప్రాంతాల్లో పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు వరుసగా బొబ్బ వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది నాగభూషణరావు, బెల్లంకొండ లక్ష్మి, పిల్లి లక్ష్మణరావు, బోనం కృష్ణారావు, మేకా వెంకట నరసింహారావు, చలమలశెట్టి వీరయ్య సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో చల్లపల్లి బీఎంసీ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులు

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు అనేకం

చల్లపల్లి: సహజసిద్ధమైన ప్రకృతి వ్యవసాయం చేసి పంటలు పండిచటం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.శ్యామల అన్నారు. వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఎపిసిఎన్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక, విత్తన గుళికలు తయారు చేయటంపై మండస్థాయి అవగాహన, సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఏవో సాయిసింధు అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. శ్యామల మాట్లాడుతూ ప్రతి ఇంటి పెరట్లో, తమ పంట పొలాల్లో ప్రతి ఒక్కరూ సహజ సిద్ధంగా ఆహారాన్ని పండించుకోవటంపై శ్రద్ధ వహించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ శాఖ మొవ్వ క్లస్టర్ మాస్టర్ ట్రైనర్ బొడ్డు రాంబాబు మాట్లాడుతూ సాధారణంగా 32 రకాల ధాన్యాలను పచ్చిరొట్టగా వేసుకోవటం వల్ల భూమి సారవంతంగా మారుతందని వివరించారు. ధాన్యాలు మొలకలు వచ్చిన 40 రోజుల తర్వాత పొలాన్ని దుక్కిదున్నిస్తే 5 టన్నుల పచ్చిరొట్ట అందించినట్లవుతుందన్నారు. విత్తన గుళికల తయారీ విధానాన్ని చూపించారు. ఏపీఎం శ్రీనివాసరావు, వీఏవోలు, రిసోర్స్ పర్సన్స్, గ్రామ క్లస్టర్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ ఎస్.శ్యామల, పక్కన ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ రాంబాబు

క్లుప్తంగా

నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

కోడూరు: రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్నవారికి పురస్కారాలను అందించనున్నట్లు ఐక్యవేదిక కార్యదర్శి కోట కేశవ పెరుమాళ్లు శనివారం తెలిపారు. ఆదివారం స్థానిక శివరామకృష్ణ క్షేత్ర ప్రాంగణంలో ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ముందుగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా సంప్రదాయ పాత పాటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభకన బర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు కేశవపెరుమాళ్లు చెప్పారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-25 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోచింగ్ తరగతులు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జరుగుతాయని, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన అసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. వివరాలకు 94407 30562, 93903 53504, 82474 27885లలో సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

కమనీయం భ్రమరాంబ మల్లేశ్వరుని కల్యాణం



టీ.కొత్తపాలెం(నాగాయలంక): స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలలో శుక్రవారం రాత్రి అంబా సాయికిరణ్‌శర్మ, ఘంటశాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబ, మల్లేశ్వరుని కల్యాణం కమనీయంగా సాగింది. పీటలపై బండ్రెడ్డి జితేంద్రరెడ్డి- భార్గవి దంపతులు కూర్చుని స్వామివారి కల్యాణ పూజ శాస్త్రోక్తంగా జరిపారు. అంతకు ముందు వేద మంత్రోశ్చరణల నడుమ జగజ్యోతి, ఎదుర్కోల ఉత్సవం సంప్రదాయ బద్ధంగా జరిపారు. అనంతరం పంచరత్నాలు పౌరాణిక జానపద నాటకాన్ని వివిధ ప్రాంతాల రంగస్థల కళాకారులు ప్రదర్శించారు. ఆదివారం కొట్నాలు, వసంతోత్సం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ సిహెచ్.సుధాకరరావు చెప్పారు.

సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలికి పరామర్శ

పర్రచివర(నాగాయలంక): కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు, రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా మాజీ ఉపాధ్యక్షురాలు రమాదేవిని న్యూఢిల్లీ తెలుగు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఇండియన్ రైల్వే శాఖ ఉన్నతాధికారి మెండు చక్రపాణి తదితరులు శనివారం పరామర్శించారు. ఇటీవల ఆమె భర్త బీజేపీ నేత మహేంద్ర భాస్కర్ మరణించిన విషయం తెలుసుకుని మండలంలోని పర్రచివర గ్రామానికి వచ్చారు. రమాదేవి, కుమారులు సుబ్బారావు, శ్రీకాంత్, దుర్గాప్రసాద్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మహేంద్ర చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు ఏపీ ఎంఎస్ఐడి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మెండు లింగయ్య నాయుడు, ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ తరగతులు ప్రారంభం

మచిలీపట్నంఅర్బన్: స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో ఆర్ఎంపీలకు శనివారం సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ తరగతులు ప్రారంభించారు. ఎనిమిది రోజులపాటు నిర్వహించే తరగతులలో ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్, హైపోథెర్మియా, బ్లీడింగ్, ఫ్రాక్చర్స్, డాగ్, స్నేక్ బైట్స్, స్మోక్ అస్తమా షాక్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బి.శంకర్ నాథ్, ట్రెజరర్ కొండపల్లి రామ్ బాలాజీ, ఏపీఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు బండి రామాంజనేయులు, డాక్టర్ తోట వీరేంద్రనాథ్, డాక్టర్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

• స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలి

మచిలీపట్నంఅర్బన్: వేసవిని దృష్టిలో పెట్టుకుని పదవ తరగతి స్పాట్ వేల్యూషన్ కేంద్రం వద్ద ఉపాధ్యాయులకు అన్ని సదుపాయాలు సమకూర్చాలని ఫ్యాప్టో చైర్మన్ అంబటిపూడి సుబ్రమణ్యం కోరారు. అనారోగ్య కారణాలతో స్పాట్‌కి రాలేని ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం డీఈఓ సూపరింటెండెంట్ సముద్రేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన కార్యదర్శికే రాజేంద్రప్రసాద్, డి.అశోక్ కుమార్, బి.లంకేశ్వరరావు, కృష్ణమూర్తి, అస్లాం, నవీన్, అశోక్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

• ఉగాది పురస్కారానికి సీఐ రమణమ్మ ఎంపిక



చిలకలపూడి(మచిలీపట్నం): ప్రస్తుతం గుడివాడ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న ఇంజరపు రమణమ్మ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. యువతకు ఆన్‌లైన్ యాప్‌ల గురించి వారికి వివరించి చైతన్యం తీసుకువచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి ఉగాది వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారం అందుకునేందుకు ఎంపిక య్యారు. ఆదివారం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకోనున్నారు.

• సింహాద్రి వాణికి ఉగాది పురస్కారం



బందలాయిచెరువు(అవనిగడ్డ): విజయవాడలో నివాసం ఉంటున్న బందలాయిచెరువుకు చెందిన సింహాద్రి వాణికి ఉగాది పురస్కారం లభించింది. గతంలో ఈమె అనేక పద్య, వచన కవితలు రాశారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేసినందుకు వాణిని ఉగాది పురస్కారానికి ఎంపిక చేశారు. విజయవాడలో ఆదివారం జరిగే ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు.

• ప్రభుత్వ వైద్యశాలకు బెడ్‌షీట్లు అందజేత

అవనిగడ్డ: చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రూ.30 వేల విలువగల బెడ్‌షీట్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందించారు. బెడ్‌షీట్స్‌తో పాటు పల్స్‌ఆక్సీ మీటర్లను వైద్యశాలకు అందజేశారు. ఐవీఎం నిర్వాహకులు డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా, సభ్యులు రాజేష్, స్వితిన్‌రాస్, ఆషి, ఆది, డాక్టర్ నాగజ్యోతి, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

• సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టాలి

పెడన: పట్టణంల్లో బ్రహ్మపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యర్రా సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో పాటు పలువురు కౌన్సిలర్లను, మున్సిపల్ కమిషనర్ గోపాలరావును కలిశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు మొహమ్మద్ ఖాజా, బైలపాటి జ్యోతి, 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, ఇన్‌స్పెక్టర్ పి.హరికిషోర్ ఉన్నారు.

• అగస్తేశ్వరునికి ప్రత్యేక హోమం

పెడన: పట్టణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత అగస్తేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అమావాస్య నష్టగ్రహ కూటమి ఏర్పడే ప్రభావం చేత లోకరక్షణార్థం పెడన అగస్తేశ్వర స్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం ఈ పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు ఆగస్తయ్య తెలిపారు. హోమాలను వేద పండితులు ఐలూరి జైకిషోర్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. 22 మంది దంపతులు పాల్గొన్నారు.

• ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలి

భోగిరెడ్డిపల్లి(మచిలీపట్నం రూరల్): ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండలాధ్యక్షుడు బీ సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని భోగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను శనివారం సీఐటీయూ నాయకులు ఆ ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల నుంచి కూలీడబ్బులు ఇవ్వటం లేదని కూలీలు తెలిపారు. కూలీలకు టెంట్లు వేయాలని, తాగు నీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని మార్చి పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు.

• బీమా చెక్కు అందజేత

కొడాలి(ఘంటసాల): మండలంలోని కొడాలి గ్రామానికి చెందిన మట్టా శివనాగమల్లేశ్వరరావు యూనియన్ బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ బాలకృష్ణ ప్రోత్సాహంతో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంలో చేరాడు. అయితే ఈ నెల 12న శివనాగమల్లేశ్వరరావు గుండెపోటుతో మరణించాడు. దీంతో అతని భార్య అనితకు బీమా సొమ్ము రూ.2 లక్షల విలువైన చెక్కును శనివారం బ్యాంకు మేనేజర్ రవివర్మ అందించారు.

• ఆకట్టుకున్న నాట్యాంజలి

శ్రీకాకుళం(ఘంటసాల): కాకుళేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండలంలోని శ్రీకాకుళంలో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వరస్వామి వారి దేవస్థానంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అన్నమచార్య సేవా ట్రస్టు తెలంగాణ సెక్రటరీ తాళ్లపాక గౌరి ప్రసూన, డైరెక్టర్ మీనాక్షి శ్రీనివాస్, ఈవో డి.శ్రీరామ వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఆత్కూరి సీతారామరాజు, కళాకారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

• పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో నిజాలు నిగ్గు తేల్చాలి

మచిలీపట్నంటౌన్: దేశ వ్యాప్తంగా ఇటీవల కాలంలో క్రైస్తవులపై హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయని, వీటిని నియంత్రించేందుకు కూటమి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో క్రైస్తవులు దేశ వ్యాప్త ఆందోళనలకు పూనుకోవటం జరుగుతుందని పరిశుద్ధ ఆంధ్రేయ మహా దేవాలయం (తెలుగు చర్చి) పాస్టర్ రెవరెండ్ సీఎల్ జాస్పర్ హెచ్చరించారు. ఇటీవల మృతి చెందిన పాస్టర్ డాక్టర్ ప్రవీణ్ పగడాల మృతిలో అనుమాలనాలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన నివృత్తి చేయాలని కోరుతూ పలు క్రైస్తవ సంఘాల గురువులు, పలు చర్చిన పాస్టర్‌లు శనివారం తెలుగు చర్చి మీటింగ్‌హాల్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. జాస్పర్ మాట్లాడుతూ ప్రవీణ్ మృతికి గల కారణాలు వెల్లడించాలని, హత్య అయితే దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తెలుగు చర్చి నుంచి క్రైస్తవుల ఐక్య శాంతి ర్యాలీ నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రధాన మార్గాల్లో ఉంటుందని చెప్పారు. మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొని డిమాండ్‌ను వెలుగెత్తి చాటాలని వారు కోరారు. ఈ కేసు విషయంలో న్యాయాన్ని, సత్యాన్ని కాపాడేందుకు పాలకులు దృష్టి సారించాలని చేతులెత్తి ఆయన నమస్కరించారు. పాస్టర్ ఏబెల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బెరాకా మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ కేఎస్ కిరణ్‌పాల్, బేతేలు ప్రార్థనామందిరం పాస్టర్ వాల్టర్స్ ప్రేమ్‌కుమార్, పాస్టర్లు వై.రాజు, చాట్ల జాన్‌వెస్లీ, కే డానియల్‌రాజు, జాషువా, ఎ.అనిల్, ఎడ్విన్ సుధాకర్, ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరాజులుకు డాక్టరేట్

గూడూరు: మండల పరిధిలోని చిట్టిగూడూరు గ్రామానికి చెందిన కొలుసు గోవిందరాజులు సాహిత్య విభాగంలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 'రామభద్ర దీక్షితస్య సాహస్రమంజరా: విమర్శనాత్మక మధ్యయనమ్' అనే అంశముపై ప్రముఖ సాహితీ వేత్త, పరిశోధన, ప్రచురణ విభాగానికి చెందిన విశ్రాంతాచార్యులు సీహెచ్.సత్యనారాయణ మార్గదర్శకంలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ఈ డాక్టరేట్ పొందారు. విశ్వవిద్యాలయం చతుర్థ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ చాన్సలర్ ఎస్.గోపాలస్వామి, వైస్ చాన్సలర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. గోవిందరాజులును పలువురు అభినందించారు.

• గంగాభవానీ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి

కోడూరు: స్థానిక గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు శనివారం తెలిపారు. తొలిరోజు రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అనంతరం పోతురాజు సంబరం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం అమ్మవారికి మహిళలచే నైవేద్యాల సమర్పణ, ప్రత్యేక అలంకరణ చేస్తారు. రాత్రికి ప్రధాన గుడిజాతర ఉంటుందని చెప్పారు.

• క్రైస్తవుల నిరసనగా ర్యాలీ

కోడూరు: రాజమండ్రిలో ఇటీవల హత్యకు గురైన పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసును ప్రభుత్వం ఛేదించి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల సియోను పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్‌స్టేషన్ వద్ద నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్‌ది హత్యేనని,ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం శోచనీయమని ఫెలోషిప్ నేతలు మండిపడ్డారు హత్యకు ముందు ప్రవీణ్‌కు అనేక సార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయని, వీటిని కూడా పరిగణలోకి తీసుకొని విచారణ చేయాలని పాస్టర్లు డిమాండ్ చేశారు. ఎస్ఐ చాణిక్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వినతిపత్రాన్ని అందించారు. ప్రవీణ్‌తో కొందరు వాదనలకు దిగిన విషయాన్ని వివరిస్తూ చర్యలు తీసుకోవాలని పా స్టర్లు ఎస్ఐకి వినతిపత్రంలో పేర్కొన్నారు.